క్లుప్తంగా

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతపై హర్షం

కొడంగల్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉన్నా పోటీ చేయొచ్చని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం కురుమ సంఘం జిల్లా కార్యదర్శి కుర్వ నాగప్ప హర్షం వ్యక్తం చేశారు. గతంలో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఉండేదని, చట్టాన్ని మార్చే ప్రక్రియను క్యాబినెట్ నిర్ణయించడంతో ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి

లగచర్ల గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య



కొబ్బరికాయ కొడుతున్న లక్ష్మయ్య

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తండాలు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీ లగచర్ల గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పులిచర్లకుంట తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. లగచర్ల–హకీంపేట్ బీటీ రోడ్డు నుంచి తండాకు వెళ్లేందుకు బీటీ మంజూరు చేశారన్నారు. దాదాపుగా రూ.10లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టినట్లు లక్ష్మయ్య తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

'కృష్ణవేణి'లో దీపావళి



సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

తాండూరు టౌన్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు దీపావళి నిర్వహించారు. విద్యార్థులు టపాసులు కాలుస్తూ సందడి చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. పండుగలు, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే స్కూల్‌లో దీపావళి వేడుక నిర్వహించామన్నారు. ఎప్పటికైనా చెడుపై మంచి విజయం సాధిస్తుందనే విషయాలను కథల రూపంలో వివరించామని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కుల్కచర్ల: సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో 108 సిబ్బందితో కలిసి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్, ఈఎంటీ చంద్రశేఖర్, నరేశ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐజీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఆనంద్ కులకర్ణి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో ఏఐజీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, గ్రామస్తులు వెంకటేష్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

డీసీసీ రేసులో మాజీ మేయర్

బడంగ్‌పేట్: కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ఎన్నిక కోసం ఏఐసీసీ నుంచి వచ్చిన బృందాలు ఆయా నియోజకవర్గాలు, మండలాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. తాజాగా డీసీసీ రేసులో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి సైతం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే తన దరఖాస్తును కూడా ఏఐసీసీ పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. మేయర్‌గా చేసిన అనుభవంతో పాటు నిజామాబాద్, వనపర్తి తదితర జిల్లాలకు ఎన్నికల పర్యవేక్షకురాలిగా పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.

ఆదరణకు నోచుకోని వాటర్ ప్లాంట్!



ఐనెల్లిలో నీటి శుద్ధీకరణ కేంద్రం

- ఆరు నెలలుగా పనిచేయని నీటి శుద్ధీకరణ యంత్రం
- పంచాయతీలో డబ్బుల్లేక విలవిల
- స్వచ్ఛమైన తాగునీటికి కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: ప్రతిఒక్కరికీ తాగునీరు తప్పనిసరి. పర్యావరణ కాలుష్యం, జనాభా పెరుగుదల, సహజ వనరుల క్షీణత కారణంగా స్వచ్ఛమైన నీటి లభ్యత కరువవుతోంది. ఈ క్రమంలో స్వచ్ఛమైన నీటి కోసం ప్రజలు ఇతర శుద్ధీకరణ కేంద్రాలను, ప్రైవేట్‌గా విక్రయించే దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. తాండూరు మండలం ఐనెల్లి గ్రామంలో మంచినీటి సరఫరా చేసే నీటి శుద్ధీకరణ కేంద్రం ఆదరణకు నోచుకోవడం లేదు. మరమ్మతులకు గురై ఆరు నెలలు గడుస్తున్నా తమకేమి సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చు పెట్టామని ఇకపై తమనుంచి రూపాయి కూడా ఖర్చు పెట్టే స్తోమత లేదని పంచాయతీ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అందరూ చందా వేసుకొని డబ్బులు ఇస్తే నీటి శుద్ధీకరణ కేంద్రానికి మరమ్మతులు చేయిస్తానని కార్యదర్శి చెబుతుంది. ఐనెల్లి గ్రామ జనాభా 1,200, ఓటర్లు 928 మంది ఉన్నారు. గ్రామంలో దాదాపు 280 ఇళ్లు ఉన్నాయి. అందరికీ జీవనాధారం వ్యవసాయమే. ప్రస్తుతం గ్రామస్తులకు మిషన్ భగిరథ నీటితో పాటు సింగిల్‌ఫేజ్ బోరు మోటర్ల నుంచి తాగునీటి సరఫరా కొనసాగుతుంది. గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద 2022 సంవత్సరంలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేసేవారు. కొన్ని సంవత్సరాలు ఇది సజావుగానే సాగింది. అనంతరం ఈ పథకం ఆరు నెలల నుంచి మూలన పడింది. నీటి శుద్ధీకణ కేంద్రంలో యంత్రాలు పాడవ్వడంతో ప్రస్తుతం అది మూతబడింది. దీంతో గ్రామస్తులు ఫిల్టర్ వాటర్‌కు దూరమయ్యారు. దూర భారమైన కొందరు సమీప గ్రామం నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి శుద్ధీకరణ కేంద్రానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

గ్రామస్తులు సహకరించాలి



ఐనెల్లి గ్రామంలో ఆరు నెలల క్రితం వాటర్ ఫిల్టర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. యంత్రాలను బాగు చేయించడానికి రూ.60వేలు ఖర్చవుతోంది. ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పంచాయతీ నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చు పెట్టాం. ప్రస్తుతం పంచాయతీలో ఒక్క రూపాయి కూడా లేదు. గ్రామస్తులు అందరూ చందాలు వేసుకొని డబ్బులు ఇస్తే మరమ్మతులు చేయించి, చందాదారులకు స్మార్ట్ కార్డు ద్వారా నీటిని అందజేస్తాం. – అపర్ణ, పంచాయతీ కార్యదర్శి, ఐనెల్లి, తాండూరు మండలం

మలుపులు.. ప్రమాదాలకు పిలుపు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మోమిన్‌పేట-చంద్రాయన్‌పల్లి వద్ద మలుపు

మోమిన్‌పేట: రోడ్డు మలుపులతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూచిక బోర్డులు లేక ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోమిన్‌పేట నుంచి చంద్రాయన్‌పల్లి మీదుగా కోల్కుందకు వెళ్లే రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా మలుపు ఉంది. అక్కడ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం



దుద్యాల్: ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



అనంతగిరి: మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్



పరిగి: మాట్లాడుతున్న వెంకటయ్య

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య

పరిగి: 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కేంద్రం అడ్డుకుంటుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ బిల్లును గవర్నర్‌కు పంపిస్తే ఆమోదించకుండా బీజేపీ కుట్ర పన్నుతుందన్నారు. రాష్ట్ర బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు.

దుద్యాల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీజేపీ అడ్డుకుంటోందని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీసీలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని, ప్రాణాలకు తెగించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నేటి రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు మద్దతివ్వడంతో పాటు బీజేపీ కూడా మద్దతివ్వడం విడ్డురంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, సురేశ్, ఆశన్న, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

బంద్‌కు కురుమ సంఘం మద్దతు

తాండూరు టౌన్: బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు కురుమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు డివిజన్ అధ్యక్షుడు అడ్వకేట్ కె గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఐ మద్దతు

నేటి బంద్‌కు సీపీఐ మద్దతు ఇస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు.

అనంతగిరి: రిజర్వేషన్ల సాధనకు బీసీ జేఏసీ చేపట్టబోయే బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమిళనాడు తరహాలో చట్టం చేసి పార్లమెంట్‌లో చర్చించి 9వ షెడ్యూల్‌లో పెట్టాలని ఎందరో మేధావులు చెప్పారని గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణల ప్రక్రియతోనే ఇది సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, దత్తు, సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎంపీడీవోకు గౌతపూర్‌వాసుల వినతి



ఎంపీడీవోకు సమస్య వివరిస్తున్న గౌతపూర్‌వాసులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో విశ్వప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ..గౌతపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. నెల రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కాలనీలో సింగిల్‌ఫేజ్ బోరు మోటారు ఉన్నా తమ ఇళ్లకు నీటి సరఫరా సక్రమంగా కావడం లేదని వివరించారు. ఈ విషయంలో స్పందించిన ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

స్వయం ఉపాధితో పేదరిక నిర్మూలన

- ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్ రూరల్: స్వయం ఉపాధితో నిరుద్యోగం, పొదుపు వంటి చర్యలతో పేదరికాన్ని నిర్మూలించొచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరికం ఆటంకంగా మారిందన్నారు. జనాభా విస్ఫోటనం, నిరుద్యోగం, సంపద, వనరుల అసమాన విస్తరణ, ప్రకృతి విపత్తులు పేదరికానికి ప్రధాన కారణమన్నారు. ప్రతిఒక్కరూ నిజాయితీగా కష్టపడి పనిచేసినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది టి.రాంబాబు, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ జైపాల్, డాక్టర్ సోమ్లా, ఎం.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుండా లాక్కుంటున్నారు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

నవాబుపేట: నష్ట పరిహారం ఇవ్వకుండా తన భూమిలో పవర్‌గ్రిడ్ హైటెన్షన్ స్తంభాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బాధితుడు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూకట్‌పల్లికి చెందిన దేవరపు కిరణ్‌కుమార్‌కు నవాబుపేట మండలం దాతాపూర్ రెవెన్యూలోని సర్వేనంబర్ 29లో 6 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని 2024లో వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో పవర్‌గ్రిడ్‌కు సంబంధించిన 750కేవీ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడానికి దాదాపు 9 గుంటల భూమిని స్వాధీనం చేసుకోవాని చొరబాటుదారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని గ్రహించిన బాధితుడు ఆ పనులను నిలిపివేయించాడు. అయినప్పటికీ పవర్‌గ్రిడ్ సిబ్బంది తరచూ తనపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా పనులు చేయించాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నాడు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు కోరారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్లకు చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, కసిరే వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయలక్ష్మి భర్త నర్సింలు, ప్రశాంత, హైమద్ తదితర తన అనుచరులతో సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీసీల రిజర్వేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో నిలబడే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయ స్వామికి పూజలు



సిద్దనొంపు పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న క్రమంలో 108వ శనివారం పురస్కరించుకొని 108పర్యాయాలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభం, 8గంటలకు పంచామృతాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం మహామంగళ హారతి, మధ్యాహ్నం 12–30గంటల నుంచి అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గవాయ్‌పై దాడి హేయమైన చర్య

- బాధ్యులను శిక్షించాలి
- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు



తాండూరు రూరల్: వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌మాదిగ తదితరులు

యాలాల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్యని, బాధ్యులను శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై దాడిగానే భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నల్ల బ్యాడ్జి ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ..సీజేపై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌పై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, లాలప్ప, మెట్లి క్రిష్ణ, నరేశ్, మహేశ్, సుధాకర్, శాంతు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ సాజిదాబేగంకు వినతి

ధారూరు: మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ధారూరు తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి చేసిన రాకేశ్‌కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నర్సింహులు మాదిగ, స్వామిదాస్, శంకర్, పిల్లికండ్ల ఆనంద్, జ్యోతి, లక్ష్మయ్య, మురళీ, అమృత, శివరాం తదితరులు ఉన్నారు.

న్యాయమూర్తికి రక్షణ కరువు

తాండూరు రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రక్షణ కరువైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ పేర్కొన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగంపై దాడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సిములు మాదిగ, శివాజీ మాదిగ, పరుశురాం మాదిగ, అనిల్, రవి, కృష్ణ, అశోక్, బన్నీ, రాములు, నగేష్, కృష్ణ, శ్రీకాంత్, ఆనందం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నేతలు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాడికి పాల్పడిన బాధ్యులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దోమ ప్రధాన చౌరస్తాలో..

దోమ: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ..దాడి చేసిన నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బందెయ్య, బొంపల్లి వెంకటేశ్, మల్లేశ్, రాఘవేందర్‌రెడ్డి, మొగులయ్యగౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస్, దోర్నాల్‌పల్లి శ్రీనివాస్, నర్సింహులు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



దోమ: తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

బంట్వారం: రాకేశ్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ కోట్‌పల్లి మండల ఇంచార్జి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. కోట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండి ప్రేమ్‌కుమార్, శ్రీశైలం, సుందరయ్య, సామెల్, లక్ష్మయ్య, సునీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు. గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజక వర్గం ఇంచార్జి రొంపల్లి నర్సింలు ఒక ప్రకటనలో కోరారు.



ధారూరు: తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



యాలాల: తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బంట్వారం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భరత్ కుమార్